
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

● విశాఖ-చెన్నై రైలు మార్గంలోని అన్నవరం నుంచి కాకినాడ తీరంలో కొత్తగా నిర్మించబోయే గ్రీన్ ఫీల్డ్ పోర్టు-కాకినాడ పోర్టు-కోటిపల్లి-నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం పోర్టులను కలుపుతూ బాపట్ల వరకు జాతీయ రహదారి-216కు అనుబంధంగా కోస్తా రైలు మార్గం నిర్మించాలి. **-దశాబ్దకాలంగా కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం విన్నపం**

● నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేయండి. ఈ లింక్‌ను బాపట్ల దగ్గర కోల్‌కత్తా-చెన్నైలతో అనుసంధానం చేయండి. **-దిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఈనాడు, కాకినాడ



కోస్తా రైలు మార్గంపై కోటి ఆశలు

సాకారమైతే సౌలభ్యమిదే..

వ్యవసాయ, పారిశ్రామిక, నౌకా వాణిజ్యం, పెట్రోలియం-గ్యాస్ నిక్షేపాలు, సముద్ర-నదీ మత్స్య ఉత్పత్తులకు కోస్తా తీరంలో కొదవే లేదు. సుదీర్ఘ సాగర తీరం.. గోదావరి-కృష్ణా నదీ పరివాహకం.. ఈ ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని నిర్మిస్తే రాకపోకలకు సౌలభ్యం కలుగుతుంది. పారిశ్రామిక-వాణిజ్య రంగాలకూ ఊతమిచ్చినట్లు అవుతుందన్నది దశాబ్దకాలంగా వినిపిస్తున్న వాదన. తాజాగా దిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రైలు మార్గం మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని కలిసి కోరడం.. సానుకూల స్పందన రావడంతో ప్రాజెక్టు సాకారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయనే మాట వినిపిస్తోంది.



▪ కాకినాడ నగరానికి ప్రధాన రైలు మార్గం అనుసంధానం కాలేదు. దీంతో ఇటు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు.. లేదంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది. మార్గం సాకారమైతే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

▪ చెన్నై-విశాఖ ప్రధాన రైలు మార్గానికి ఇది ప్రత్యామ్నాయ రైలు మార్గంగా మారుతుంది. 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకూ సౌలభ్యంగా ఉంటుంది.

▪ గోదావరి, కృష్ణా నదుల మధ్య కోనసీమ, దివిసీమ లాంటి ప్రాంతాలకు రైలు మార్గం ఏర్పాటు ద్వారా సుందర ప్రదేశాలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి వీలుంది.

▪ అన్నవరం నుంచి గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. గతంలోనే కాకినాడ-కోటిపల్లి రైలు మార్గం నిర్మించారు. కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం పనులు సాగుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నుంచి కాకినాడ-నరసాపురం నుంచి మచిలీపట్నం-రేపల్లె, నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు 100 కి.మీ పైగా రైలు మార్గం నిర్మిస్తే సరిపోతుంది.

▪ కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం నిర్మాణంలో భాగంగా గోదావరి ప్రాంతంలోని నదులపై వంతెనల నిర్మాణం సాగుతోంది. మిగిలింది కృష్ణా నదిపై వంతెన నిర్మాణమే. తక్కువ ఖర్చుతో ఈ మార్గం పూర్తిచేయవచ్చు.

ఉమ్మడి గోదావరి-కృష్ణా జిల్లాలకు మేలు

కోస్తా రైలు మార్గం కోసం పదేళ్లకుపైగా పోరాడుతున్నాం. మా డిమాండ్‌ను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినందుకు ధన్యవాదాలు. ప్రధాన రైలు మార్గానికి ప్రత్యామ్నాయంగా.. నాలుగు పోర్టులు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ మార్గం ఏర్పాటైతే ఈ ప్రాంతీయుల రాకపోకలకు సౌలభ్యంతోపాటు.. పారిశ్రామిక, వాణిజ్యరంగాలకూ ఊతమిచ్చినట్లువుతుంది.

- వైడీ రామారావు, దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యులు

చట్టాలపై అవగాహన

యానాం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ శిక్ష సంహితపై అవగాహన పెంచుకోవాలని పుదుచ్చేరి పోలీసు శిక్షణ స్కూల్ ఎస్పీ రంగనాథ్ సూచించారు. యానాంలోని ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో కొత్త చట్టాలపై పోలీసులకు రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని యానాం ఎస్పీ యు.రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు.

తీరంలో అలజడి

భారీ వర్ష సూచనతో యంత్రాంగం అప్రమత్తం


పెరుమాళ్లపురం సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈనెల 16 వరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖలు సహాయక చర్యలకు సమాయత్తం కావాలని సూచించింది. దీంతో యంత్రాంగం అప్రమత్తమైంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు డీఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. తీర ప్రాంత మండలాల తహసీల్దార్ కార్యాలయాలు, డివిజనల్ అధికారి కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కంట్రోల్ రూమ్ నం.
08856 293104

విద్యుత్తు శాఖకు సంబంధించి..

విద్యుత్తుశాఖ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా విద్యుత్తు లైన్లపై చెట్లు, కొమ్మలు పడినా, తీగలు కిందకు వేలాడినా, స్తంభాలు బాగా ఒరిగిపోయినా ప్రజలు వెంటనే కంట్రోల్ రూంలకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

అమలాపురం డివిజన్
94409 04477
రామచంద్రపురం డివిజన్
94931 78821

ఫుల్ జోష్

413 మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి


లక్కీడ్రాకు తరలివచ్చిన దరఖాస్తుదారులు



లాటరీ తీస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఈనాడు, కాకినాడ -న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఈ ప్రక్రియ సాగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 413 దుకాణాలకు లాటరీ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. లాటరీ సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే సందడి కనిపించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభించిన లాటరీ ప్రక్రియ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మధ్యాహ్నానికే ముగిస్తే.. తూర్పుగోదావరి జిల్లాలో సాయంత్రం వరకు సాగింది. ఎక్కడా ఎలాంటి అనుమానాలు, వివాదాలకు తావివ్వకుండా.. లక్కీడ్రా ప్రక్రియ మొత్తం కలెక్టర్లు వీడియో దృశ్యాలు చిత్రీకరించారు. జిల్లాల వారీగా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమ సంఖ్య ప్రకారం లాటరీ తీశారు. అధికారులు ఒకటికి రెండుసార్లు పేర్లు, టోకెన్ నంబర్లు మైక్‌లో చెబుతూ దరఖాస్తు చేసుకున్న వారి సమక్షంలో డ్రా తీశారు.

ఎంపిక ఇలా..

లక్కీడ్రాలో దుకాణం దక్కించుకున్న విజేతను.. సక్సెస్‌ఫుల్ క్యాండిడేట్ అని.. ఆ తర్వాత వచ్చిన రెండు టోకెన్లను రిజర్వుడు 1, 2 కింద ఎంపిక చేశారు. లక్కీడ్రాలో విజేత సొమ్ము చెల్లించి, లైసెన్సు పొందకపోతే.. మిగిలిన ఇద్దరికి ప్రాధాన్య క్రమంలో అవకాశం దక్కుతుంది


ఒకే దరఖాస్తుతో డ్రాలో షాపు దక్కించుకున్న వ్యక్తి (పసుపు చొక్కా)తో ఇతరుల మంతనాలు

మహిళల ఆసక్తి

మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి పలువురు మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. వీరి పేరుతో కలిసొస్తుందని పలువురు భార్య, కుమార్తె, ఇతర మహిళా కుటుంబీకుల పేర్లతో దరఖాస్తు చేశారు. రాజమహేంద్రవరంలో 250 మందికిపైగా వనితలు దరఖాస్తు చేయడం గమనార్హం. జిల్లాల వారీగా కాకినాడలో 10, కోనసీమలో 11, తూర్పుగోదావరి జిల్లాలో 12 మద్యం దుకాణాలు మహిళలకు దక్కాయి.

133 మంది ఎంపిక

అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో లాటరీ ప్రక్రియకు కౌంటర్ 1లో అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం సర్కిళ్లు, కౌంటర్ 2 వద్ద రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం సర్కిళ్ల లక్కీడ్రా నిర్వహించారు. 133 దుకాణాలకు 4,087 దరఖాస్తులు వచ్చాయి. డ్రా ద్వారా 133 మందిని ఎంపిక చేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ లాంఛనంగా లక్కీడ్రాను ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఈఎస్ వరప్రసాద్ రెవెన్యూ, అబ్కారీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

◆ మద్యం దుకాణాలు దక్కించుకోడానికి సిండికేట్‌గా మారి పదుల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా కొందరికి దుకాణాలు దక్కలేదు. ఒకే దరఖాస్తుతో కొందరు డ్రాలో గెలుపొందారు. గతంలో మద్యం వ్యాపారం చేసిన కొందరికి దుకాణాలు దక్కకపోవడంతో.. ఇప్పుడు దక్కించుకున్నవారితో రాయబారాలు మొదలుపెట్టారు. ◆ పలువురు ఎన్ఆర్ఐలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా వారికి దుకాణాలు దక్కలేదు.

ఊరూరా ఉత్సవమే..

'పల్లె పండగ' ప్రారంభం


ముమ్మిడివరం: కొత్తలంక గ్రామంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, తదితరులు

ముమ్మిడివరం: పల్లె పండగకు అడుగు పడింది. అయిదేళ్ల తర్వాత ఊరూరా ఆనందం వెల్లివిరిసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలు.. జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. పలు చోట్ల కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముమ్మిడివరం మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పాల్గొని వివిధ గ్రామాల్లో రూ.2.85 కోట్లతో 31 పనులకు 5.28 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, డ్వామా పీడీ మధుసూదన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు శ్రీనివాసరావు, పార్థసారథి పాల్గొన్నారు.

కార్తికం.. సత్యదేవుడి సన్నిధిలో సన్నద్ధం

అన్నవరం, న్యూస్‌టుడే: రానున్న కార్తిక మాసంలో భక్తుల రద్దీ నేపథ్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులను ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. అదనపు వ్రత మండపాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వసతి గదుల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. దర్శనాలు, వ్రతాల నిర్వహణ, ట్రాఫిక్, వసతి, భద్రత తదితర అన్ని అంశాలపై చర్చించి ఏర్పాట్లను ఈ నెల 22 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, పర్వదినాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 19న సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఫిర్యాదులపై సత్వరం విచారణ పూర్తి చేసి పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశామని ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి నుంచి వచ్చిన 14 మంది నుంచి వినతులు స్వీకరించారు.

సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన మానవ హక్కుల కార్యకర్త, సాయిబాబాకు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. జిల్లాకు చెందిన పలువురు హైదరాబాద్ వెళ్లి ఆయన పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. అయినవిల్లి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ, శ్రీనివాసరావు తదితరులు హైదరాబాద్ వెళ్లి సాయిబాబాకు నివాళి అర్పించారు. ఆయన భార్య వసంత, కుమార్తె మంజీర, సోదరుడు రాందేవ్‌లను ఓదార్చారు. మానవ హక్కుల పరిరక్షణకు సాయిబాబా ఎంతో పాటుపడ్డారని కొనియాడారు.


సాయిబాబా భార్య వసంతను ఓదారుస్తున్న గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ

స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ కోరారు. సోమవారం స్వర్ణాంధ్ర ప్రణాళికపై ఆయన సమీక్ష నిర్వహించారు. 15 శాతం వృద్ధి రేటుతో మండల, పురపాలక, జిల్లా స్థాయిలో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అధికారులు బాధ్యతతో వ్యవహరిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, ఉద్యానం, మత్స్య ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చేలా.. పోషకాలు అందేలా

2028 వరకు ఉచిత బియ్యం పంపిణీ గడువు పెంపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పేదల ఆహార భద్రతకు కేంద్ర, రాష్ట్రాలు భరోసా కల్పించాయి. ఆకలి తీర్చేందుకు, పోషకాహారం అందించేందుకు ఉద్దేశించిన ఉచిత బియ్యం పంపిణీని మరో నాలుగేళ్లు పొడిగించారు. కొవిడ్ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై)లో ప్రతి నెలా కార్డులోని ప్రతి వ్యక్తికి అయిదు కిలోల వంతున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. తొలుత నిర్ణయించిన ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31తో ఈ పథకం గడువు ముగియనుంది. 2028 వరకు పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

కేంద్రం రాయితీ 29 శాతం కార్డులకే..

పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) పరిధిలో ఉన్న కార్డులకు కేంద్రం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. జిల్లాలో 1.62 లక్షల కార్డులు(29 శాతం) మాత్రమే ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలో ఉన్నాయి. వీటికే కేంద్రం ఉచిత బియ్యం ఇస్తోంది. మిగిలిన కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ భరిస్తోంది.

జిల్లా వివరాలు ఇలా..

మండలాలు	22
రేషన్ దుకాణాలు	926
ఎండీయూలు	355
రేషన్ కార్డులు	5,47,722
ఏఏవై	24,804
అన్నపూర్ణ	340

ఫోర్టిఫైడ్ బియ్యం..

గతంలో ప్రజలకు సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తుండగా.. కేంద్రం ఆదేశాల మేరకు గత ఏడాది సెప్టెంబరు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. సార్టెక్స్ బియ్యంలో 15 శాతం, నాన్‌సార్టెక్స్‌లో 25 శాతం వరకు నూకలు ఉంటాయి. గతంలో వీటినే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారు. పోషక బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో 100 కిలోల సార్టెక్స్ బియ్యంలో యంత్రాలతో కిలో కెర్నల్(పోషకాహారం) కలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యంలో విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఉంటాయి.


ఎండీయూ ద్వారా బియ్యం పంపిణీ

ఇక్కడ నుంచే సరఫరా..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో కలిపి సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఈ ధాన్యం చాలా వరకు మిల్లులకే చేరుతుంది. ఇక్కడ బియ్యం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు సరఫరా అవుతున్నాయి. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) కింద గుర్తించిన 163 మిల్లుల్లో పోషక బియ్యం తయారీకి కెర్నల్ కలిపే బ్లెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు.

నాలుగేళ్లు పొడిగించారు..

పీఎంజీకేఏవైలో జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డు దారులకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీకి గడువు పెంచారు. కార్డుదారులందరికీ పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నాం. పోషక విలువలతో కూడిన ఈ బియ్యాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలి.

- ఉదయ్‌భాస్కర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

అపార్టుమెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: అపార్టుమెంట్‌పై నుంచి పడి బాలుడు మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా సర్పవరం పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నగర పరిధి ఎల్‌బీనగర్‌లో ఉంటున్న ఆటోడ్రైవరు కుక్కల మల్లేశ్వరరావు కుమారుడు చరణ్‌శ్రీతేజ(13) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పెన్సిల్ తెచ్చుకోవడానికి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. కాసేపటికి చరణ్‌శ్రీతేజ సమీపంలోని ఓ అపార్టుమెంట్‌పైనుంచి పడి మృతి చెందాడని ఇంటికి సమాచారం అందింది. వెంటనే వెళ్లిన కుటుంబ సభ్యులు బాలుడి మృతదేహంతో తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. అసలు బాలుడు అపార్టుమెంట్‌పైకి ఎందుకు వెళ్లాడు. అక్కడ్నుంచి ఎలా పడిపోయాడనేది దర్యాప్తు చేస్తున్నామని, అతని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఎవరో పిలిస్తేనే శ్రీచరణ్ అపార్టుమెంట్ పైకి వెళ్లినట్లు తెలిసిందని, మృతిపై అనుమానాలున్నాయని అతని చిన్నాన్న వీరాంజనేయులు పేర్కొన్నారు.


చరణ్‌తేజ (పాత చిత్రం)

ప్రమాదం అంచున ప్రయాణం


పాశర్లపూడిలంక మధ్యతరహా కాలువపై ప్రమాదకరంగా పైపు కల్వర్టు


ప్రధాన రహదారుల్లో శిథిల కల్వర్టులు ప్రమాదకరంగా ఉండటంతో రాకపోకలకు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి నుంచి రాజోలు మండలం తాటిపాక వరకు 216వ నంబరు జాతీయ రహదారిలో ఉభయ గోదావరి సహా విశాఖ జిల్లాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. పాశర్లపూడి పరిధి కైకాలపేట వద్ద కల్వర్టు రక్షణగోడ విరిగిపోవడం, నగరంలోని పెట్రోలుబంకు సమీపంలో ఇరుకు కల్వర్టుకు ఒకవైపు రక్షణగోడ కుంగి రంధ్రం పడటంతో అంతా హడలెత్తిపోతున్నారు. పాశర్లపూడిలంకకు వెళ్లే మార్గంలో వాడబోది మీడియం డ్రెయిన్‌పై ఉన్న పైపు కల్వర్టు కిందిభాగం ఛిద్రమై, ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోవడంతో మూడు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. వీటి ఆధునికీకరణకు సత్వరమే కార్యాచరణ చేయాలని కోరుతున్నారు. రక్షణ గోడలు విరిగిన కల్వర్టులకు చర్యలు చేపడతామని సంబంధిత ఏఈఈలు ఆనంద్‌కిరణ్, పురుషోత్తం తెలిపారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలు చేసి పంపిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

పార్లమెంట్ కమిటీ సభ్యుడిగా హరీశ్

అమలాపురం కలెక్టరేట్: కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి శాఖ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ నియమితులయ్యారు. ఈ మేరకు తొలి సమావేశం సోమవారం పార్లమెంట్ భవనంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రతిష్ఠాత్మక పార్లమెంట్ కమిటీలో సభ్యుడిగా సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తన పరిధి మేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు, నేతన్నలకు ప్రభుత్వ పథకాలు చేరువ చేసేందుకు, యువతకు పూర్తి స్థాయిలో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. హరీష్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.


సమావేశంలో ఎంపీ హరీష్ మాథుర్

లోవలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు



తుని గ్రామీణం: తలుపులమ్మ వారి లోవ దేవస్థానంలో అమ్మవారికి సోమవారం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవస్థానం వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా దేవస్థానం డీసీ విశ్వనాథరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పరీక్షల నిర్వహణలో మార్పులు చేయండి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరీక్షల నిర్వహణలో మార్పు చేయాలని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సెల్ఫ్ అసెస్‌మెంట్-2(ఎస్ఏ2) పరీక్షలను రోజుకు రెండు నిర్వహించాలని, ఆగస్టు సిలబస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సీబీఏ (ఓఎంఆర్ షీట్) పరీక్షను మార్చుచేసి యూనిట్ టెస్టు మాదిరిగా డీసీఈబీ ద్వారా నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీకి సోమవారం లేఖ రాశారు. వివిధ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్పీకి ఫిర్యాదు చేయనున్న కాల్‌మనీ బాధితులు

మండపేట, న్యూస్‌టుడే: చిరు వ్యాపారులు, చిరుద్యోగుల వద్ద అధిక వడ్డీ గుంజుతూ, చెల్లించలేకపోతే బెదిరింపులకు పాల్పడుతున్న కాల్‌మనీ వ్యాపారులపై దండెత్తి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పాటు కూటమి నాయకులను కలుసుకుని న్యాయం చేయాలని కోరనున్నట్లు బాధితులు తెలిపారు. 'కాల్‌మనీ కేటుగాళ్ల' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో మరికొంత మంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే బయటకు వచ్చిన బాధితులతో పాటు మిగిలిన వారిని కలుపుకొనేందుకు వారి చిరునామాలు సేకరిస్తున్నారు.

బడికి రానివారు 19%



ఏం జరుగుతోంది?

వరుసగా పిల్లలు నెలపాటు బడి మానేస్తే ఆటుపోటి విద్యార్థి పేరు తీసేయకుండా అదే బడిలో డ్రాప్‌బాక్సులో పెడుతున్నారు. రికార్డుల్లో వారి బంధువుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. పిల్లలు బడిలో లేకపోతే మేమేం చేయగలమని ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పిల్లలంతా ఐదోతరగతి తరువాత బడికొచ్చినా అభ్యసనలో వెనుకబడిపోతున్నారు.

అక్కడ స్ఫూర్తి

విద్యా వ్యవస్థలో ఆదర్శంగా నిలిచే కేరళ రాష్ట్రంలో విద్యార్థుల గైర్హాజరు కేవలం 2.7 శాతం మాత్రమే. చాలా పాఠశాలల్లో వంద శాతం హాజరవుతుంటారు.

ఇక్కడ ఇలా..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌టీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 396 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చే ముందురోజు(అక్టోబరు 1న) బడికి వచ్చిన వారి సంఖ్య 302. గైర్హాజరు అయినవారు 24 %.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3,812 పాఠశాలల్లో సగటున 19 % మంది విద్యార్థులు బడికి హాజరు కావడం దుమ్మకొట్టుతున్నారు. మధ్యాహ్న భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్లిపోవడమో.. కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చేస్తున్నారు. రోజులు అసలు ఊళ్లోనే ఉండడం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, పామర్రు

పాఠశాలల హాజరు పుస్తకాల్లో విద్యార్థుల పేర్లు నమోదై ఉంటాయి. తరగతులకు మాత్రం హాజరు కావడం లేదు. కారణం ఏమిటని పరిశీలిస్తే కొందరు కుటుంబాలతో సహా వలసలు వెళ్లిపోతున్నారు. ఎక్కువమంది కూడా తెలియని పరిస్థితి. అప్పట్లో వైకాపా ప్రభుత్వ హయాంలో బడి బయట పిల్లలు అసలు లేరని అంకెల గారడీ చేయడానికి విద్యాశాఖ నానా తంటాలు పడింది. బడి మానేసిన పిల్లల తరగతి వెయిల్ అయిన వారి వివరాలు కూడా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు.

డ్రాప్ బాక్స్ ఖాళీచేయించి..

ఎక్కువ రోజులు బడి మానేసిన విద్యార్థులను డ్రాప్‌బాక్స్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. డ్రాప్ బాక్సును ఖాళీ చేయాలని, వారందరినీ బడిలో చేర్పించాలని వెనక్కి తీసుకొవాలని కూడా చెప్పారు. దీంతో చేసేది లేక వారి, వీరి అని తేడాలేకుండా పిల్లలను బడిలో చేర్పించి హాజరు పట్టికలో నమోదు చేసేశారు. వారంతా కొత్త విద్యా సంవత్సరం వచ్చేసరికి ప్రమోట్ అయిపోయి కొత్త తరగతులకు పేర్లు వచ్చేశాయి. తాము పలానా బడిలో చదువుకుంటున్నామని, ఉత్తీర్ణత పొంది మరో తరగతికి వచ్చేశామన్న విషయం కూడా పాపం పిల్లలకు తెలియదు.

ఉన్నత పాఠశాలల్లో పరిశీలిస్తే..

అంబేడ్కర్ కోనసీమలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 19, కాకినాడలో 21 శాతం మంది విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు. సగటున ఈ లెక్క 19 శాతం.

ఇవీ కారణాలు

- వ్యవసాయ పనులు, పండగలు, స్థానికంగా నిర్వహించే జాతరలు, సీజనల్ వ్యాధులు, వరదల కారణంగా పిల్లల గైర్హాజరు ఎక్కువయ్యిందని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.
- వలసలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది.
- ఇటుక బట్టీల పనులు, రొయ్యల చెరువుల పనులకు కూడా తల్లిదండ్రులతో పిల్లలు వెళ్లడం, రావడం జరుగుతోంది. ఇలాంటివన్నీ పిల్లల హాజరు తక్కువగా ఉండడానికి కారణాలుగా కనబడుతున్నాయి.

సరిదిద్దే ప్రయత్నం

ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమీక్షిస్తూ.. విద్యార్థుల హాజరు శాతం ఎందుకు తక్కువగా ఉంటోంది? పేర్లున్న వారందరూ బడికి ఎందుకు రావడం లేదు? తెలుసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలు, కారణాలను అన్వేషిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పరిస్థితి చక్కదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



నాడు కళకళ.. నేడు వెలవెల

మహిళాభివృద్ధే ధ్యేయంగా రాజోలు మండలం శివకోటిలో నిర్మించిన భవనం గత అయిదేళ్లుగా నిరుపయోగంగా పడి ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి విషసర్పాలకు నిలయంగా మారింది. 2013లో ప్రారంభమైన ఈ భవనంలో 2019 వరకు మహిళలు, యువతులకు టైలరింగ్‌లో శిక్షణ పొందేవారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దుర్భరంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు.

- న్యూస్‌టుడే, రాజోలు

అమ్మ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని..

ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతి



సురేఖ (పాత చిత్రం)

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తనకు వివాహం చేస్తే తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని ఆవేదనతో ఓ యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎ.ఎస్.ఐ. పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన సురేఖ(23) పేరవరం తపాలా కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. అసలే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తల్లి.. తనకు వివాహం చేస్తే మరింతగా కష్టాలు పడుతుందనే ఆవేదనతో గత నెల 30న తాను పనిచేస్తున్న కార్యాలయం వద్ద పురుగు మందు తాగారు. అప్పటి నుంచి రాజానగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.ఎస్.ఐ. తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన నల్లూరి శివను ఆదివారం సాయంత్రం ఆత్రేయపురం పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై రాము తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించామన్నారు. జరిగిన సంఘటనపై ఐసీడీఎస్ సీడీపీవో శారద, సూపర్‌వైజర్ కుమారి, వివిధ శాఖల అధికారులు సోమవారం బాధిత బాలిక ఇంటికెళ్లి విచారణ జరిపారు. పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు చెప్పారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కొత్తపేట: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి మోడేకుర్రు గ్రామశివారు గొలకోటి వారిపాలేనికి చెందిన ఈతకోట నాగరాజు(48) కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మద్యం తాగే అలవాటు ఉంది. దీనిపై భార్య మందలించడంతో మనస్థాపంతో ఆదివారం రాత్రి ఇంటివద్ద పురుగు మందు తాగేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండటంతో భార్య సత్యవతి, కుమారుడు అవినాష్‌లు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు పెయింటింగ్ పనిచేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నట్లు తెలిపారు.

పుదువై బిజినెస్ ఫెస్టివల్‌లో రూ.9.85 కోట్లు బహుమతులు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి వ్యాపారవేత్తల సంఘం సహకారంతో ఈ నెల 18 నుంచి వచ్చే ఏడాది జనవరి 20 వరకు పుదుచ్చేరిలో బిజినెస్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో కొనుగోలుదారులకు కూపన్లు అందజేసి లాటరీ తీయనున్నారు. ప్రథమ బహుమతిగా రూ.2.48 కోట్ల విలువైన 40 కార్లు, ద్వితీయ బహుమతిగా రూ.80 లక్షలతో 80 స్కూటర్లు, తృతీయ బహుమతిగా రూ.29 లక్షలు విలువైన 400 టేబుల్ టాప్ గ్రైండర్లు, నాలుగో బహుమతిగా రూ.17.60 లక్షలతో 400 మిక్సీలు కలిసి రూ.9.85 కోట్ల విలువైన బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఫెస్టివల్ ద్వారా రూ.400 కోట్ల వ్యాపారం జరగనుందని, ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.60 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

తులాభారానికి వెండి తాపడంపై అంచనాలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో తులాభారానికి వెండి తాపడం చేయించడంపై అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న తులాభారాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. వెండి తాపడం చేయించడానికి ఎంత వెండి అవసరం అవుతుందో అంచనాలు రూపొందించాలన్నారు. దాతల సహకారంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూపాయల్లో)
కొత్తకాయ	11,500
కురిడీ (వెయ్యింటికి)	
పాతకాయ గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి)	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (సన్న) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్	
15 కిలోల	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

గోదావరిలో గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం

ద్రాక్షారామ, పామర్రు, న్యూస్‌టుడే: కోటిపల్లి వద్ద గోదావరి రేవులో దీపం విగ్రహం నిమజ్జనం కార్యక్రమంలో ఆదివారం రాత్రి చెరువుకు చెందిన మేడిశెట్టి వీరబ్రహ్మం (38), నరాల వేదమూర్తి (28) గల్లంతయ్యారు. సోమవారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఉదయం వీరబ్రహ్మం, మధ్యాహ్నం వేదమూర్తి మృతదేహాలు బయటపడ్డాయి. శవపంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్సై జానీబాషా తెలిపారు. సాయంత్రం మంత్రి వాసంశెట్టి సుభాష్ రావిచెరువు వెళ్లి మృతదేహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. మృతులు ఇద్దరూ నిరుపేదలని, వారికి ఎటువంటి ఆధారం లేదని వాపోయారు. వారి కుటుంబాలను ఆదుకొని ప్రభుత్వ సాయం అందించాలని వేడుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరుతో మాట్లాడి కృషి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

రైతేరాజు

తీపిజొన్న సాగు.. లాభాలు బాగు

న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం



మొక్కజొన్న పొత్తులు(స్వీట్‌కార్న్) చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. వీటికి మార్కెట్‌లో గిరాకీ ఉండటంతో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఈ పంటను జిల్లాలోని పలుచోట్ల పండిస్తున్నా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పొత్తులకు మాత్రం ప్రత్యేక గుర్తింపు ఉంది. సారవంతమైన నల్లరేగడి నేలలు కావడంతో నాణ్యత, రుచి, సైజులో పెద్దవిగా ఉండటం వీటి ప్రత్యేకత. దీంతో ఇక్కడి పొత్తులకు మంచి గిరాకీ ఉందని రైతులు చెబుతున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, బెంగళూరు, తమిళనాడు, ఒడిశా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్వీట్‌కార్న్‌తో పాటు కోళ్ల దాణాకు ఉపయోగించే పొత్తులను ఇక్కడి రైతులు విస్తారంగా పండిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పండించిన వాటిని అమ్మేందుకు సైతం తీసుకురావడంతో ఏడాది పొడవునా పొత్తులు అందుబాటులో ఉండి కొనుగోలుదారులతో మార్కెట్ కళకళలాడుతోంది.

స్ఫూర్తి


పంట దిగుబడి ఇలా...

మార్కెట్‌లో లభించే నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకుని నాట్లు వేస్తారు. ఎకరాకు 6 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంటుంది. కాట్రావులపల్లి, యర్రంపాలెం, సీతానగరం తదితర గ్రామాలతో పాటు మండలంలోని సుమారు 150 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. ఇక్కడ పండించిన పంటకు స్థానికంగానే మార్కెట్ ఉండటంతో ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.



కాట్రావులపల్లిలో పండిస్తున్న మొక్కజొన్న

మెలకువలు పాటిస్తే ..



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పండిస్తున్నా. పెట్టుబడి, శిస్తు, ఎరువులు, కూలీల ఖర్చు పోను ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. నాట్లు వేసిన 70 నుంచి 80 రోజుల్లో పూర్తవడంతో ఏడాదికి మూడుసార్లు పంట వేయడంతో ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుంది. సాగులో మెలకువలు పాటిస్తే మంచి ఆదాయం వస్తుంది.

- గంధం దుర్గాప్రసాద్, కౌలురైతు

కోకోలో తెగుళ్లు నివారిద్దాం..



కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో పంటకు సంబంధించిన వివిధ సమస్యలపై రైతులు అడిగిన ప్రశ్నలకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ పలు సూచనలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

ప్రశ్న సమాధానం

● అకాల వర్షాల ప్రభావంతో కోకోలో కాయకుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి?

- ఎ.రాజమోహన్, రైతు, పుల్లేటికుర్రు

సమాధానం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కాయకుళ్లు తెగులుకు సోకడానికి అనుకూలం. ఈ తెగులుకు ప్రధాన కారణం ఫైటోఫ్థోరా పామివోరా అనే బూజు జాతి శిలీంద్రం. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు.. లీటరు నీటిలో కలిపి కాయలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి.

● కోకో పంటకు సోకే గజ్జి తెగులు నివారణ చర్యలు తెలపండి?

- జి.వెంకటేశ్వరరావు, రైతు, ముమ్మిడివరం

సమాధానం: కోకో చెట్టు కాండంపై ముదురు ఎరుపురంగు చిక్కటి జిగురు కారి, క్రమేణా అవి ఎండి తుప్పు మరకలా కనిపిస్తాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు లేదా ట్రైకోడెరా బూజు జాతి శిలీంద్రం పేస్టును మచ్చలపై పూతలా వేయాలి.

సేంద్రియ ఎరువుతో నాణ్యమైన పట్టు



గొల్లప్రోలు: సేంద్రియ ఎరువుల వాడకంతో నాణ్యమైన మల్బరీ ఆకును ఉత్పత్తి చేసి పట్టుగూళ్ల పెంపకంలో అధిక దిగుబడులు సాధించొచ్చని పట్టుపరిశ్రమల శాఖ అధికారి మోసయ్య తెలిపారు. నాణ్యమైన మల్బరీ ఆకును పొందేందుకు తోటల పెంపకంలో చేపట్టాల్సిన చర్యలను ఆయన ఇలా వివరించారు.

తెలుసుకుందాం..

◆ ప్రతి పంటకు ముందు పశువుల ఎరువులను విధిగా వేయాలి. తద్వారా ఆకు నాణ్యత పెరిగి.. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టుపురుగు నాణ్యమైన గూడును అల్లుతుంది. ◆ భూసారాన్ని బట్టి అవసరమైతే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి. ◆ కోత కోసిన 50 రోజుల తరువాత మాత్రమే ఆకులను పట్టు పురుగులకు మేతగా వేయాలి. ◆ మల్బరీ తోటలో యూరియా అధికంగా వేస్తే పట్టు పురుగులకు పారుడు రోగం ఆశించి నష్టం వాటిల్లుతుంది. ◆ బైవోల్టిన్ పట్టు పురుగులు పెంచే రైతులు విధిగా పశువుల ఎరువులను ఉపయోగించాలి. ◆ పట్టు పురుగులు పెంచే షెడ్లలో 25-28 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూడాలి. తేమ విషయమై నిరంతరం పర్యవేక్షించాలి.

ఇలా చేస్తే పండుగప్పతో ఆదాయమే..



ఉప్పలగుప్తం: పండుగప్ప చేపల సాగులో వ్యాధుల బెడద వేధిస్తోంది. జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని ఉప్పలగుప్తం మత్స్యశాఖాధికారి హేమనంద్ సూచిస్తున్నారు.

వ్యాధి ఇలా..: పండుగప్పలకు ఆహారంగా మైనా గొరకలు, రొయ్యల ప్రోసెసింగ్ కంపెనీల నుంచి సేకరించిన వ్యర్థాలను రైతులు వేస్తున్నారు. వ్యాధి ప్రభావం ఉన్న చెరువుల నుంచి సేకరించినది కావడంతో రెడ్, తాటాకు, బూజు తెగుళ్లు సోకుతున్నాయి.

మీ కోసం

జాగ్రత్తలు: ◆ పట్టుబడి పూర్తయిన చెరువులను నెర్రలు వచ్చేవరకూ ఎండబెట్టాలి. ◆ పిల్లెట్ రూపంలో మార్కెట్లోకి వచ్చిన ప్రొటీన్ మేత ఇస్తే వ్యాధులు రావు. ◆ ల్యాబ్ పరీక్షలు చేయించి నిపుణుల సూచనలు పాటించాలి. నీటి మార్పిడి చేసుకుని చెరువు శుభ్రతకు శానిటైజర్లు చల్లుకోవాలి.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని డా.దుర్గారావు అన్నారు. సఖినేటిపల్లి లంకలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సర్పంచి రేవూరి రాజేశ్వరి అధ్యక్షతన క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోకినవారు వైద్యుల సలహాలు పాటించాలన్నారు. రెండు వారాల పైబడి దగ్గు వచ్చినా, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రివేళల్లో జ్వరం, కళ్లె పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వెంకటరమణ, పడాల పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వరస్వామి నిత్యాన్నదానానికి ప్రస్తుత అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన ఎలిశెట్టి వీరపాత్రుడు, వెంకటేశ్వరం దంపతులు సోమవారం రూ. లక్ష విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సీనియర్ ఉద్యోగి వర్మ స్వామివారి చిత్రపటం అందించారు.



మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

రోడ్డుపై చెత్త తొలగింపు

రావులపాలెం పట్టణం: రావులపాలెం శ్రీనివాస నగర్‌లో రోడ్డు చెంతన చెత్తాచెదారం వేయడం వల్ల పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

వీధి దీపాల ఏర్పాటు

ఆత్రేయపురం: ఆత్రేయపురంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి గెడ్డ సుధ వద్ద ప్రస్తావించగా స్పందించి వీధి దీపాలు వేయించారు.

వీధులు శుభ్రం చేశారు..

ఆత్రేయపురం: నార్కెడుమిల్లి గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి పాలా నాగేశ్వరరావు వద్ద ప్రస్తావించగా స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

ఊరించి.. ఊరుకున్నారు

అటకెక్కిన న్యూట్రిగార్డెన్ల నిర్వహణ

న్యూట్రిగార్డెన్ల కార్యక్రమం కింద అవకాశం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పెరటి తోటలు పెంచాలని నిర్ణయించగా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. కొత్తపేట ఐసీడీఎస్ పరిధిలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో 285 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో కూరగాయల సాగుకు అవసరమైన స్థలంతో పాటు సాగుకు నీటివసతి ఉన్న కొన్ని కేంద్రాలను ఎంపిక చేశారు. వాటి ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు సాగుచేసి వాటినే వంటకు వినియోగించాలని నిర్దేశించారు. ప్రస్తుతం ఇదంతా మొక్కుబడి తంతుగా మారిపోయింది. ప్రారంభంలో హడావుడి చేసిన అధికారులు ప్రస్తుతం వాటి ఊసే ఎత్తడం లేదు. అప్పట్లో గ్రామ దత్తత అధికారులు ప్రతి శుక్రవారం తనిఖీలు నిర్వహించి పెరటి తోటల పెంపకాన్ని పర్యవేక్షించి తగు చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు అదేమీ కానరావడం లేదు. స్థలం ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు.

పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపంతో రక్తహీనత సమస్య వెంటాడుతోంది. దీన్ని అధిగమించేందుకు పంచాయతీలు, స్త్రీశిశు సంక్షేమశాఖ, డ్వామా సంయుక్తంగా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రిగార్డెన్లు పేరుతో కూరగాయల పెంపకాన్ని చేపట్టాయి. ఈ తోటల్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కాయగూరలు, ఆకుకూరలను లబ్ధిదారులకు అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం, రావులపాలెం పట్టణం



న్యూట్రిగార్డెన్ లేని వాడపల్లి అంగన్‌వాడీ కేంద్రం

రక్షణ కరవు..

స్వయం ప్రయాసలకోర్చి కూరగాయల సాగు చేపట్టినా రక్షణ లేకపోవడంతో అవికాస్తా పశువుల పాలవుతున్నాయని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల పశువులు చొరబడి తినివేస్తున్నాయని చెబుతున్నారు. దీంతో అధికారులు సరిచేస్తేందుకు చిన్నపాటి కుండీల్లో(కిచెన్ గార్డెన్) మొక్కలను ఉంచి పెంచుతున్నట్లు చూపుతున్నారు.

లక్ష్యాలు ఇవీ..

ఖాళీ స్థలాలను వినియోగంలోకి తెచ్చి చిన్నారులకు ఆరోగ్య వంతమైన పోషకాహారం అందించడానికి ఉత్పత్తులను అందించాలి. పోషకాహార విలువలను గర్భిణులకు, బాలింతలకు తెలియజేస్తూ చైతన్యం తీసుకురావాలి. పోషక లోపాలు లేకుండా చూడాలి.

స్థల సమస్య ఉంది..

కొన్ని కేంద్రాల్లో పెరటి తోటలు వేసినా రక్షణ లేకపోవడంతో పశువులు వాటిని ధ్వంసం చేస్తున్నాయి. కొన్నిచోట్ల స్థలాలు అందుబాటులో లేకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. నీరు పుష్కలంగా ఉండి రక్షణ ఏర్పాట్లు ఉన్న స్థలాలను గుర్తించి వాటిలో కూరగాయల సాగుచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కుమారి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్

సీపీఎం నూతన కమిటీ ఎన్నిక

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండల సీపీఎం కార్యదర్శిగా కారుపల్లి గోపాలస్వామి ఎన్నికయ్యారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం జరిగిన మహాసభకు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలకులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలో సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం పేదల పక్షాన సీపీఎం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆదేశించారు. ఆయన సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో ఆలయ పరిసరాలను పరిశీలించారు. కొత్త పార్కింగ్ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులకు స్వామివారి దర్శనం సులువుగా అయ్యేవిధంగా క్యూలైన్లు మార్పు చేయాలని సూచించారు.

అధ్యాపకుల నిరసన దీక్ష



కరస్పాండెంట్ ఛాంబర్‌లో బైఠాయించిన అధ్యాపకులు

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం గత 35 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మలికిపురం ఎంఎస్‌ఎన్ చార్లెస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం కరస్పాండెంట్ ఛాంబర్‌లో బైఠాయించి మౌనంగా నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తిని బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వచ్చి ఆయన్ను బయటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ జీతాల కోసం తాము పోరాటం చేస్తుంటే జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తమతో జీతం మాటా ఉండానికి కూడా ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీతాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్తపేట జూనియర్ కళాశాలలో..

కొత్తపేట: ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కొత్తపేట జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం నిరసన తెలిపారు. గత 24 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, కొంతమందిని క్రమబద్ధీకరించారన్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి కారణంగా ఈ ప్రక్రియ నిలిచిపోయిందని, వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల నరసింహం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకే పల్లె పండగ

సఖినేటిపల్లి, అయినవిల్లి, రావులపాలెం గ్రామీణం, రావులపాలెం పట్టణం, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పల్లిపాలెంలో సర్పంచి ఒడుగు శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్ ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, ఎంపీపీ మల్లిబాబు, జడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యుడు బాస్కరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో 206 రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. స్థానికంగా రూ.6.50 లక్షలతో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు.



పల్లిపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ



విలసలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

● సఖినేటిపల్లి మండలం గొంది, గుడిమూల, కేశవదాసుపాలెం, వివిధచోట్ల పల్లె పండగ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సీసీరోడ్లకు భూమిపూజ చేశారు.

● అయినవిల్లి మండలం విలస, కె.జగన్నాథపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపనలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వం గ్రామాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం రావులపాలెం శివారు మల్లాయిదొడ్డి వద్ద నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొత్తరావులపాడు, కోమరాజులంకలో రూ.28 లక్షలు, ఈతకోటలో రూ.49 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల శంకుస్థాపన చేశారు. రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కులో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు, పోలీస్‌స్టేషన్ వద్ద రూ.20 లక్షలతో బస్‌షెల్టర్ నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



ప్రజల వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

పేదల సంక్షేమమే లక్ష్యం: బండారు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పేదల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. రావులపాలెం, కోమరాజులంక, ఊబలంక, రావులపాడు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ఐదేళ్ల పాలనలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. 359 అర్జీలు వచ్చినట్లు ఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, సర్పంచులు పాల్గొన్నారు.

నరకానికి నకళ్లు.. ఈ దారులు

ఆలమూరు, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే కొన్నాడ-మండపేట ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. దీంతో పాటు నర్సిపూడి, పెనికేరు మీదుగా కొత్తూరు సెంటర్‌కు వెళ్లే రహదారి, కొత్తూరు నుంచి వెదురుమూడి వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోవడంతో నిత్యం విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరుచేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

వర్షాలతో అవస్థలు..

అల్పపీడన ప్రభావంతో సోమవారం కురిసిన వర్షానికి పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడికుదురు మండలం లూటుకుర్రు, గోగన్నమఠం, పెదపట్నంలంక రోడ్లపై నీరు నిలిచిపోయింది. రాజోలు ప్రధాన రహదారి జలమయమైంది. ● మండల కేంద్రం మలికిపురంలో వినాయకుడి ఆలయం నుంచి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే రహదారిలో గుంతల్లో నీరుచేరి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. శంకరగుప్తం-బట్టేలంక, మట్టపర్రు-గుడిమెళ్లంక, లక్కవరం-విశ్వేశ్వరాయపురం అగ్రహారం, విశ్వేశ్వరాయపురం-మట్టపర్రు, కేశనపల్లి-కరవాక రహదారులు అస్తవ్యస్తమయ్యాయి. ● పి.గన్నవరం, కుండాలేశ్వరం, ముంగండపాలెం, ముంగండ, బోడపాటివారిపాలెం, శివాయలంక తదితర గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.



రాజోలు ప్రధాన రహదారి దుస్థితి..



పి.గన్నవరం: ర.భ.శాఖ రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు



మలికిపురం: తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో..



పి.గన్నవరంలో ఊరేగింపు



పెదపట్నంలో రావణ దహనం

నిమజ్జన వేడుక

రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించి నదుల్లో నిమజ్జనం చేశారు. అన్నా వేలం పాటలు నిర్వహించారు. ● అంతర్వేది వశిష్ఠ రేవులో హైదరాబాద్‌లోని కుషాయిగూడకు చెందిన 70 మంది భక్తులు దుర్గమ్మ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు విజయకుమార్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో దసరా ఉత్సవాలు అనంతరం అమ్మవారి విగ్రహాలను ఏటా ఇక్కడే నిమజ్జనం చేస్తుంటామని, ఈ ఏడాది అంతర్వేదికి తీసుకొచ్చినట్లు వివరించారు. వీరిని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, యువత సన్మానించారు. ● మలికిపురం ట్రాఫిక్ స్టేషన్ ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మామిడికుదురు మండలం పెదపట్నం వైనతేయ నదీ తీరంలో భక్తులు నిలువెత్తు రావణ బ్రహ్మ బొమ్మను దహనం చేశారు.

- న్యూస్‌టుడే, అంతర్వేది, మలికిపురం, ఆలమూరు, పి.గన్నవరం, మామిడికుదురు



అంతర్వేది వశిష్ఠ రేవులో నిమజ్జనం చేస్తున్న కుషాయిగూడకు చెందిన భక్తులు

విద్యుత్తు అంతరాయాల నివారణకు చర్యలు

ఆలమూరు: చొప్పెల్ల సబ్‌స్టేషన్‌లో తరచూ విద్యుత్తు అంతరాయాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్ఈ రాజబాబు, డీఈ కె.రత్నాలరావు, ఏడీఈ సీహెచ్ శ్రీధర్ అన్నారు. సబ్‌స్టేషన్‌లో పనులను వారు సోమవారం పరిశీలించారు. ఏఈ దీపక్ దుర్గాప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

రైతుల మొర వినరూ..

కొత్తపేట: కొత్తపేట, మందపల్లి, కేదార్లంక లంక భూములపై ఉన్న 22/ఏ సెక్షన్ తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్‌ను కోరారు. కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. భూములకు రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగడం లేదన్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వ రాయితీలు అందడం లేదని విన్నవించారు.

ముగ్గురికి నోటీసులు జారీ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: దేవరపల్లి గ్రామ పంచాయతీలో ముగ్గురు సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు ఈవోపీఆర్డీ వి.కృష్ణ సోమవారం తెలిపారు. పంచాయతీ పరిధిలో పనులు చేయకుండా బిల్లులు పెట్టారని, కొన్నింటికి బిల్లులు లేకుండా డ్రా చేశారని గ్రామానికి చెందిన నామాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో వివరాలు కోరుతూ సర్పంచి అర్జునరావు, కార్యదర్శి వణి, జూనియర్ అసిస్టెంట్ గంగాలక్ష్మికి డీపీవో నోటీసులు జారీ చేశారన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మలికిపురం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవడానికి వసుధ ఫౌండేషన్ (హైదరాబాద్) రూ.60 వేల ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. మలికిపురంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో బి.శ్రీనివాస్(మామిడిపల్లి), కె.స్రవంతి(వేగివారిపాలెం), వాడబాని రాంబాబు(లక్కవరం), గుబ్బల మల్లేశ్వరరావు(కత్తిమండ), పెదపూడి రమణ(తూర్పుపాలెం)లకు సంస్థ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోణం రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి బుచ్చియ్య, గిడుగు తాతాలు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి జైలుశిక్ష

ఆలమూరు: ఈ నెల 8న మద్యంతాగి లారీ నడిపిన డి.రమేష్‌బాబుకు ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. అతన్ని సోమవారం కొత్తపేట జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ ఎదుట హాజరుపరచగా 15 రోజుల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

సౌండ్‌సిస్టంల నిర్వహణలో నిబంధనలు పాటించండి: డీఎస్పీ

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఉత్సవాలు, జాతరల్లో వినియోగించే సౌండ్‌సిస్టం, డీజే బాక్సులను నిబంధనల ప్రకారం రాత్రి పది గంటల లోపు నాలుగింటికే పరిమితి ఉండాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో విజయలక్ష్మీ ఉత్సవ కమిటీ, 13 పాకల వాహన, డీజే సౌండ్‌సిస్టం నిర్వాహకులతో పి.గన్నవరం సీఐ భీమరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాల సందర్భంగా అమలాపురంలో జరిగిన సంఘటనను పురస్కరించుకుని ఎస్పీ కృష్ణారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. సౌండ్‌సిస్టంలు నిర్వహించడంలో విధివిధానాలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎస్సైలు చిరంజీవి, చైతన్యకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు. అభ్యుదయ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శీలం సత్యఅర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలపై..

రాజోలు: బాణసంచా విక్రయదారులు నిబంధనలు తప్పక పాటించాలని రాజోలు సీఐ టి.వి.నరేష్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎస్సై బి.రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

చుట్టూ మురుగు.. వ్యాధుల దరువు

మలికిపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సమావేశాల్లో ఊదరగొడుతూ ఉంటారు. దీనికి భిన్నంగా రాజోలు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, నివాస గృహాల చుట్టూ మురుగు నీరు దర్శనం ఇస్తూ ఉంటాయి. మలికిపురం మండలం లక్కవరం బ్రహ్మాలవీధిలో ఇళ్ల సమీపంలో లోతట్టు ప్రాంతంలో వర్షపునీరు నిలిచిపోయింది. ప్రజలు తరచూ రోగాలబారిన పడుతున్నారు. అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గ్రామంలో ఎస్సీపేట, ఇందిరమ్మ కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



లక్కవరంలో నివాస గృహాల సమీపంలో మురుగు

● మలికిపురం మండలం రామరాజులంక, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, చింతలమోరి, తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిండి ఉన్నాయి. ● సఖినేటిపల్లి మండలం మోరిలో శంకరయ్య చేనేత కాలనీ, వీవర్స్‌కాలనీ, గాంధీనగర్ చేనేత కాలనీ, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, గొంది తదితర గ్రామాల్లో ముంపు సమస్య వెంటాడుతోంది. ● రాజోలు మండలం శివకోటి, చింతలపల్లి, రాజోలు, తదితర గ్రామాల్లో ముంపు సమస్యతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. సముద్ర తీర చింతలమోరి, శంకరగుప్తం, తూర్పుపాలెం, కేశనపల్లి, కేశవదాసుపాలెం తదితర గ్రామాల్లోని మురుగునీటిని శంకరగుప్తం మేజరు డ్రెయిన్‌లోకి మళ్లిస్తే సమస్య పరిష్కారమవుతుంది. లక్కవరంలో ముంపు నీటిని మళ్లించేందుకు జెడ్డలు బోడెను ఐదేళ్ల కాలంలో వెడల్పు చేసినా ముంపు తీరలేదు. తూర్పుపాలెం కాలనీల్లోని ముంపు నీటిని మళ్లించడానికి ఆయిల్ ఐఎన్జీసీ నుంచి మళ్లించే పరిస్థితి ఉంది.

వేరే దారిలేక..

లోతట్టు ప్రాంతాల్లోని మురుగు నీటిని మళ్లించే డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో

డెంగీతో బాధపడుతున్నాం

వర్షం నీటితో పాటు వెణుగోపాలనగర్‌కు చెందిన మురుగునీరు కూడా మా ఇళ్ల చుట్టూ చేరుతోంది. దీనికి తోడు దోమలు కుట్టడంతో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. లోతట్టు ప్రాంతంలోని ముంపు నీటిని మళ్లించడానికి వీలులేకుండా ఆక్రమణలు వెలిశాయి.

- ముస్కుడి నరసింహస్వామి, లక్కవరం

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

ఏకరూప దుస్తుల అందజేత


విద్యార్థులకు మొక్క అందిస్తున్న ఉమామహేశ్వరరావు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువుకు చెందిన మట్టపర్తి ఉమామహేశ్వరరావు స్థానిక మఠంపేట పాఠశాల విద్యార్థులకు సోమవారం ఏకరూప దుస్తులు, మొక్కలు అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ నాగాబత్తుల సత్యనారాయణ, సర్పంచి కడిమి చిన్నవరాజు, గుత్తుల సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మహోత్సవాలకు ఏర్పాట్లు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాస మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. నవంబరు 2 నుంచి డిసెంబరు ఒకటి వరకు కార్తిక ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేసే ఏర్పాట్లపై పురోహితులు, అర్చకులు, సిబ్బందితో సోమవారం ఆయన చర్చించారు. భక్తులకు క్యూలైన్లు, అదనపు సదుపాయాల ఏర్పాట్లు, విద్యుత్తు దీపాలతో అలంకరణ, జ్వాలాతోరణం, తెప్పోత్సవం వంటి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో దాట్ల రామకృష్ణంరాజు, ఆలయ పర్యవేక్షకుడు కలిగి శ్రీనివాసరాజు, యనమండ్ర సుబ్బారావు, నాగాబత్తుల రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మంత్రి పూజలు


పూజల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలోని దుడ్డువారి అగ్రహారంలో శ్రీబాలవిద్యార్థి గణపతి ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గణపతికి పూజలు చేశారు. కొండ, గోపి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం గ్రామీణం: బండారులంకలోని భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ పాలకుర్తి సత్యం చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, సర్పంచి పెనుమాల సునీత తదితరులు పాల్గొన్నారు.

కుండలేశ్వరునికి..


అలంకరణలో స్వామివారు

కాట్రేనికోన: పార్వతీసమేత కుండలేశ్వరంలో అర్చకులు కాశ్యపురి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి పూజలర్పించారు.

గ్రామాల్లో జాతర మహోత్సవాలు


అలంకరించిన అమ్మవారు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: తీరగ్రామాల్లో జాతర్లను పురస్కరించుకుని పల్లంలో గ్రామదేవత ధనమ్మతల్లికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలను తీర్చుకున్నారు. చిర్రయానం, గచ్చకాయలపోరలోను పూజలు చేశారు. ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు


గాంధీనగర్‌లో అమ్మవారి ఊరేగింపులో శక్తివేషాలు

అమలాపురం పట్టణం: గాంధీనగర్‌లో శ్రీకనకదుర్గ ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. కేరళవాయిద్యాల నడుమ శక్తివేషాలు, కొబ్రాడాన్స్‌లు, బుట్టబొమ్మలతో యువకులు, పిల్లలు నృత్యప్రదర్శనలతో అలరించారు. ● శ్రీవిజయదుర్గ అమ్మవారి ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మేళతాళాలు, గరగ నృత్యాలు నడుమ ఊరేగింపు సాగింది.


నారాయణపేటలో..

ఈసారైనా ముంపు తప్పేనా..?

పట్టణంలోని కాలువల్లో పూడికతీత పనులకు నిర్ణయం

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. అమలాపురం పట్టణాన్ని ముంపు ముప్పు వీడటం లేదు. వైకాపా పాలనలో మురుగుకాలువల్లో పూడిక తొలగించేందుకు రూ.1.02 కోట్లు వెచ్చించినా ఫలితం లేదు. తాజాగా రూ.39.74 లక్షలతో పూడికలు తొలగించేందుకు నిర్ణయించారు. ఈసారైనా పనులు సక్రమంగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గతంలో గాలికొదిలేశారు..

గతంలో పారిశుద్ధ్యం, కాలువల్లో మురుగు తొలగింపును గాలికి వదిలేశారు. పలుచోట్ల కాలువల నిర్మాణంలో లోపాలు కారణంగా వాటిలో మురుగు ముందుకు కదలడం లేదు. ఎక్కడికక్కడ మురుగు నిల్వతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారులతో పాటు వార్డుల్లో పలు వీధులు జలమయమయ్యాయి. పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రోజుల తరబడి వర్షపునీరు రహదారులు, ఖాళీస్థలాల్లో నిల్వ చేరుతోంది.


కొంకాపల్లి మురుగుకాలువ పరిస్థితి

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇలా..

పట్టణంలో ప్రధాన మురుగుకాలువలైన ఎర్రవంతెన, నల్లవంతెన, ముమ్మిడివరంగేట్, సినిమారోడ్డు, కె.అగ్రహారం, హైస్కూల్ సెంటర్, కొంకాపల్లి వరకు దారుణంగా ఉన్నాయి. ఇక్కడ దుకాణాదారులు కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. అంతర్గత రహదారులైన విద్యుత్తునగర్, సావరం రోడ్డు, రవణంవీధి, భూపయ్యఅగ్రహారం, కార్మికనగర్, సూర్యనగర్‌లోని మురుగుకాలువలలో పూడికలు పేరుకుపోతున్నాయి. చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులతో పాటు వార్డులో పలు వీధులు జలమయం అయ్యాయి. వర్షపు నీరు మురుగుతో కలిసి రహదారిపై ప్రవహించింది. పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పనులు సక్రమంగా జరిగితేనే..

పట్టణంలో రహదులు లోతుగా, మురుగు కాలువలు ఎత్తుగా ఉండటం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. స్థానికులు, వ్యాపారులు మురుగు కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో మురుగు ముందుకు కదలడం లేదు. మురుగుకాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు, కాల్వలపై నాపరాళ్లు వేసి కొందరు మూసేస్తున్నారు. గుత్తేదారులు ఆ ప్రాంతాల్లో పూడికలు తీయడం లేదు.


సావరం రోడ్డులోని రోడ్డు మీద మురుగు

పూర్తిగా తొలగిస్తాం..

పట్టణ పరిధిలో సుమారు 172 కిలోమీటర్ల మేర ప్రధాన మురుగు కాలువ వ్యవస్థ ఉంది. ఈ ఏడాదికి రూ.39.74 లక్షలతో పూడికలు తొలగించనున్నాం. ఈ పనులు సక్రమంగా జరిగేలా చూస్తాం.
– కేవీవీఆర్.రాజు, అమలాపురం మున్సిపల్ కమిషనర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి


మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలిస్తున్న డీఈవో కమలకుమారి

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో కమలకుమారి ఆదేశించారు. సోమవారం అల్లవరం మండలం కొమరగిరిపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పదార్థాలను అందించాలన్నారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సమగ్ర శిక్ష అధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రహదారి నిర్మించాలంటూ.. ఓఎన్జీసీ వాహనాల అడ్డగింత


ఉప్పలగుప్తం కూడలిలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఉప్పలగుప్తం: ఓఎన్జీసీ అనుబంధ చమురు సంస్థల వాహనాల కారణంగా పేరాయిచెరువు రహదారి అధ్వానంగా మారిందని, వెంటనే పునర్నిర్మించాలని ఉప్పలగుప్తం గ్రామస్థులు సోమవారం స్థానిక కూడలిలో నిరసన తెలిపారు. ఆ సంస్థకు చెందిన భారీవాహనాలను అడ్డుకుని రోడ్డు నిర్మించాలని డిమాండు చేశారు. అయిదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు, చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, తహసీల్దారు దివాకర్, ఎస్సై రాజేష్‌లు తదితరులు వారితో చర్చలు జరిపారు. సంస్థ యాజమాన్యం రహదారి నిర్మాణానికి ఒప్పుకోవడంతో గ్రామస్థులు ధర్నాను విరమించారు. సర్పంచి కడిమి చిన్నవరాజు, రవణం మధు, చిక్కం భీముడు, పెయ్యల దుర్గారావు, చిక్కం కాసుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం ఉమేష్, సలాది శ్రీను, నాగులాపల్లి రాజు, మధుర ప్రతాప్, చిక్కం బాలయ్య తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఉప్పలగుప్తం, : పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రుపొందించిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పల్లెపండుగ కార్యక్రమంలో మండలంలోని ఎనిమిది గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే సోమవారం శ్రీకారం చుట్టారు. చిన గాడవిల్లిలో రూ.12 లక్షలు, గొల్లవిల్లిలో రూ.9 లక్షలు, మునిపల్లిలో రూ.12 లక్షలు, ఎన్.కొత్తపల్లిలో రూ.15 లక్షలు, పెదగాడవిల్లిలో రూ.12 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించే సిమెంటు రహదారులకు భూమిపూజ చేశారు. సంక్రాంతి నాటికి పల్లెలు నూతన రహదారులతో కళకళలాడేలా పనులు త్వరితగతిన జరగాలని అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మునిపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనందరావు

మేమున్నాం.. మీకు తోడుగా




సమస్య: సుబ్బరాజువీధి నుంచి గెల్లావారివీధికి వెళ్లే దారిలో చెత్త వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. చెత్త, వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - సప్పా రవికుమార్

సమస్య: కె.అగ్రహారం బ్యాంకువీధిలో రోడ్డుపై వాహనాలు నిలిపేస్తున్నారు. రోజూ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. - కుమార్, వ్యాపారి

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పూడిక తీశారు

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధిలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – కె.సత్యనారాయణ, స్థానికుడు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించాలి. – పి.శ్రీనివాస్, స్థానికుడు

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధి, మార్కెట్ ప్రాంతాల్లోని పారిశుద్ధ్య సమస్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరాజు దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

దీపావళి నవంబరు 1న జరుపుకోవాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దీపావళి పండగను నవంబరు ఒకటో తేదీ అపరాహ్న అమావాస్యతో కూడిన ప్రదోష సమయాన జరుపుకోవాలని రాష్ట్ర పంచాంగకర్తల సమాఖ్య సభ్యుడు ఉపద్రష్ట నాగాదిత్య తెలిపారు. సోమవారం అమలాపురంలో పంచాంగ కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాఖ్య అధ్యక్షుడు త్రిభాష్యం సుబ్రహ్మణ్య శర్మ, సమాఖ్య కార్యదర్శి పొన్నులూరి శ్రీనివాస్, 47 మంది పంచాంగకర్తలు నవంబరు 1న దీపావళి చేసుకోవాలని సూచించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పురోహిత సమాఖ్య ఉపాధ్యక్షుడు ఉపద్రష్ట నాగార్జునాదిత్య, పులిపాక చంద్రశేఖరశర్మ, గొర్తి పట్టాభిశాస్త్రి, కారుపర్తి నాగమల్లేశ్వరరావు, విక్రమాదిత్య, విమలాదిత్య తదితరులు పాల్గొన్నారు.


పంచాంగం చూపిస్తున్న పంచాంగ కర్తలు

ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు

ఉప్పలగుప్తం: ఈవోపీఆర్డీ పీఆర్సీ రాజ్‌కుమార్ మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తుప్పలు తొలగించాలి


ఇరువైపులా పెరిగిన తుప్పలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోనలో తామరచెరువు శ్మశానవాటికగా ఉన్న ఓల్డ్ అయినాపురం డ్రెయిన్ గట్టుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యను సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



అమలాపురం మండలం కామనగరువు నుంచి సమనస వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభం పంటకాలువలోకి ఒరిగిపోయి దర్శనమిస్తోంది. ఈ పరిస్థితి నెలల తరబడి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటుగా వెళ్లేవారు భయాందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని విద్యుత్తు స్తంభాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

భవనాలకు రక్షణ ఎలా..?



విపత్తుల వేళ తీరగ్రామల్లో ప్రజలకు రక్షణగా ఉండేందుకు నిర్మించిన తుపాను రక్షిత భవనాలు సరైన నిర్వహణ లేకపోవడంతో పాడువుతున్నాయి. పల్లంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన భవనం కిటికీ అద్దాలను ఆకతాయిలు పగలగొట్టారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాలు పాడవ్వకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని జేఈ ఫకీర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ భవనాల గురించి రెండు నెలల క్రితం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.
- న్యూస్‌టుడే, కాట్రేనికోన

నిబంధనలు పాటించండి: డీఎస్పీ

అంబాజీపేట: ఉత్సవాలు, జాతర్లలో వినియోగించే సౌండ్‌సిస్టం, డీజే బాక్సులు నాలుగింటికే పరిమితి ఉందని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో విజయబేతాళ ఉత్సవ కమిటీ, 13 పాళాల వాహన, డీజే సౌండ్‌సిస్టం నిర్వాహకులతో పి.గన్నవరం సీఐ భీమరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాల సందర్భంగా అమలాపురంలో జరిగిన సంఘటనను పురస్కరించుకుని ఎస్పీ కృష్ణారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. సౌండ్‌సిస్టంలు నిర్వహించడంలో విధివిధానాలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎస్సైలు చిరంజీవి, చైతన్యకుమార్, శివకృష్ణ, రామారావు, శీలం సత్యఅర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో పైవంతెన నిర్మాణానికి అనుమతి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో రద్దీగా ఉండే ఇందిరాగాంధీ కూడలి నుంచి రాజీవ్‌గాంధీ కూడలి వరకు రూ.700 కోట్లతో పై వంతెన నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ప్రజాపనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యాటక కేంద్రం పుదుచ్చేరికి నిత్యం లక్షకుపైగా వాహనాలు రాకపోకలు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. 1.5 కిలో మీటర్ల మేర పైవంతెన, విల్లుపురం, కడలూరు మార్గాల వైపు రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

యానాంలో పర్యాటకశాఖ డైరెక్టర్ పర్యటన

యానాం: పుదుచ్చేరి పర్యాటక శాఖ డైరెక్టర్ కె.మురళీధరన్ సోమవారం యానాంలో పర్యటించారు. యానాంలోని పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులను పరిశీలించడానికి ఆయన ఇక్కడకు వచ్చారు. యానాం టవర్, ఐలాండ్-3లోని చెక్కల వంతెన, రాజీవ్ బీచ్, సీగల్ రెస్టారెంట్‌లను ఆయన పరిశీలించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పర్యాటక శాఖ డైరెక్టర్ మురళీధరన్‌కు వివిధ అంశాలను వివరించారు. పర్యాటక శాఖ మేనేజర్ సెల్వరాజ్, సీగల్ ఇన్‌ఛార్జి మురళి పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న మునిస్వామి

పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు డిమాండ్

అల్లవరం: అల్లవరం మండలం సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ ఇళ్ల శేషారావు అధ్యక్షతన నిర్వహించారు. అధికారిక కార్యక్రమాలకు తమకు కనీస సమాచారం ఉండటం లేదని, ప్రభుత్వం కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకు వెళ్లారు. గూడాల పంచాయతీ ఆధీనంలోని కొబ్బరి చెట్లు కేటాయింపులో అవకతవకలకు పాల్పడిన కార్యదర్శి చిక్కం శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచి దాకారపు చిరంజీవిరావు డిమాండ్ చేశారు. కార్యదర్శిని సమావేశానికి పిలిపించగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీపీ కల్పించుకుని సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు సమావేశంలో ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దార్ నరసింహారావు, ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషారావు

సాయిబాబా మృతి ప్రజా సంఘాలకు తీరని లోటు

తాళ్లరేవు: మానవ హక్కుల నేత సాయిబాబా మృతి ప్రజా సంఘాలకు తీరని లోటని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్ర పటం వద్ద ప్రజా సంఘాల కార్యకర్తలు సోమవారం నివాళి అర్పించారు. కాశి రవీంద్ర, కమిడి ఈశ్వరిబాయి, వల్లు రాజుబాబు, దుప్పి అదృష్టదీపక్, రత్నకుమారి, చల్లా సంతోష్‌కుమార్, మంగామణి తదితరులు పాల్గొన్నారు.


చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

లోతట్టు ప్రాంతాల్లోకి వరద


ముమ్మిడివరం బళ్లగేటుసెంటర్ ప్రాంతంలో..

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి చిన్నగా మొదలై సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముమ్మిడివరంలోని బళ్లగేటు సెంటర్, కుమ్మర్ల వీధి, ఆసుపత్రి వీధి, కొండాలమ్మచింత, మార్కెట్ ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి.

ఉప్పలగుప్తం: మండలంలో పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. విద్యార్థులు, వాహనచోదకులు ఇళ్లకు చేరడానికి ఇబ్బందులు పడ్డారు. భీమనపల్లి, సరిపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం తదితర గ్రామాల్లో రహదారి గుంతల్లో వర్షంనీరు చేరింది.

కాట్రేనికోన: మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. కాట్రేనికోన, హైస్కూల్ రోడ్డు, ఆంధ్రబ్యాంకు వీధి, బ్రమ్మన్నచెరువు, చెంచులగరువు, గెద్దనపల్లి తదితరచోట్ల రోడ్ల గుంతల్లో నీరు చేరడంతో విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పలుమార్లు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


రామస్వామితోటలో వర్షపు నీరు


భీమనపల్లి వద్ద రహదారిపై వర్షపునీరు

అమలాపురం పట్టణం: పట్టణంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కలెక్టరేట్‌లో మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహించిన నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి కార్లలో పట్టణానికి వచ్చారు. నల్లవంతెన దగ్గర ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నిధులు చాలక.. పనులు సాగక

అమలాపురం మండలం తాండవపల్లిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిధులు చాలక ఈ భవనం పూర్తికావడం లేదు. ప్రస్తుతం వైద్య సిబ్బంది ఓ సామాజిక భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం



రామచంద్రపురంలో జాబ్‌మేళా 16న

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. వసంతలక్ష్మి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో ముఖాముఖికి హాజరు కావాలన్నారు. కియా మోటార్స్, ఇన్వోవ్ సోర్స్, ముథూట్ ఫైనాన్స్, ఎలీ లైఫ్ సెమెంటిక్ ఎల్‌ఎల్‌పి(జేకే)లలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని, సమాచారం కోసం 82476 45389 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మండపేట

• మండపేట • రామచంద్రపురం

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

మండపేట, న్యూస్‌టుడే: తపాలా కార్యాలయం ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. గత 36 సంవత్సరాలుగా విజయమహల్ సమీపంలో ఉన్న కార్యాలయాన్ని స్థానిక ఆంధ్రా బ్యాంక్ వీధిలోకి మార్చి, సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యాలయం గతంలో ఊరికి దూరంగా ఉండేదని, ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండపేట పోస్ట్‌మాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రపురం పోస్ట్ మాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎఎస్‌పి నాగేంద్రబాబు, జి. శివయ్య, ఎండీ షరీఫ్, కె.ఈశ్వరరావు, కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత పట్టణమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు



ముఖాముఖి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు మంచి నీరు, గాలి అందించేలా కాలుష్య రహిత రామచంద్రపురాన్ని రూపొందించడమే ప్రధాన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. పట్టణంలో పలు సమస్యలపై 'న్యూస్‌టుడే'తో ముఖాముఖిలో స్పందించారు. పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి శుభ్రంగా ఉంచేందుకు, ప్రజలకు శుద్ధజలం అందించడంపై దృష్టి సారిస్తామన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

● పట్టణంలో కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న పట్టణానికి మానవ వనరుల కొరత ఇబ్బందిగా ఉంది. పట్టణంలో ప్రతి 500 మంది జనాభాకు ఒక్కరు చొప్పున సుమారు 110 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి. కానీ కేవలం 85 మంది మాత్రమే ఉన్నారు. పట్టణ విస్తీర్ణం పెద్దది కావడంతో 130 మంది వరకు అవసరం. ఇతర కార్మికులు ప్రతి 1000 మంది జనాభాకు ఒక్కరు ఉండాలని నిబంధనలు చెబుతున్నా సగం మందే ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. పారిశుద్ధ్య సమస్యల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ● మంత్రి సుభాష్ సూచనల మేరకు పట్టణంలో ఉద్యానాలు, శ్మశానాల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం. ● శివాలయం పార్కు వెనుక నిరుపయోగంగా ఉన్న కల్యాణ మండప నిర్మాణం జరుగుతోంది. సామాన్యులకు అందుబాటు ధరలతో అందించే ఉద్దేశంతో కల్యాణ మండపాన్ని త్వరలో వినియోగంలోకి తెస్తాం. ● త్వరలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతు బజారు ఏర్పాటుకు కృషి చేస్తాం. ● పాత బస్టాండ్ సెంటర్, వేణుగోపాలస్వామి గుడి వెనుక 9వ లైన్లలో ఉన్న షాపింగ్ కాంప్లెక్సులు అభివృద్ధి చేస్తాం. వ్యాపారాభివృద్ధికి అనుకూలంగా ఉండేలా దుకాణాల నిర్మాణం చేపడతాం. ● పట్టణంలో 2,900 వీధి దీపాలుండగా, ప్రస్తుతం 3,600కు పెంచాం. 20 వార్డుల్లో బల్బులు ఉన్నచోట అవసరానికి అనుగుణంగా 40 వాట్ల బల్బులు ఏర్పాటు చేస్తాం. ● వెల్ల గ్రామ తాగునీటి పథకానికి 9 ఎంఎల్‌డీల సామర్థ్యం ఉన్నప్పటికీ పట్టణానికి కేవలం 5.16 ఎంఎల్‌డీల సరఫరా ఉంటే సరిపోతుంది. వచ్చే దశాబ్దం వరకు తాగునీటి ఇబ్బందులు ఉండవు. తగిన రీతిలో స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పైపులైన్లు, ఇతర సమస్యలుంటే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

తడి పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి

మండపేట, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేరు చేయడంపై మెప్మా ఆధ్వర్యంలో వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. వేరుచేసిన వ్యర్థాలను ఇంటికి వచ్చే మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని చెప్పారు. కాయగూరల వ్యర్థాలతో ఇంట్లోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు మెప్మా సాంకేతిక నిపుణురాలు సుజాత తెలిపారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

యథేచ్ఛగా అక్రమ లేఔట్‌లు

తొమ్మిది చోట్ల హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

న్యూస్‌టుడే - మండపేట

మండపేట పట్టణంలో అక్రమ లేఔట్‌లు అధికమవుతున్నాయి. ఇటీవల పట్టణ ప్రణాళిక అధికారులు తనిఖీలు చేసి వివిధ ప్రాంతాల్లో 9 అక్రమ లేఔట్‌లను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అక్రమ లేఔట్‌ల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుండగా, అక్కడ ఎటువంటి సౌకర్యాలు కల్పించే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. తక్కువ ధరకు వస్తుందన్న ఆశతో వీటిని కొనుగోలు చేసిన వారు అనుమతులు, బ్యాంకు రుణాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల్లో మాత్రమే వీటిని సరిచేసుకునే అవకాశం ఉంది. గతంలో 70 వరకు అక్రమ లేఔట్‌లు గుర్తించగా, దాదాపు 61 చోట్ల అనుమతులు పొందారు. మిగిలిన వాటి గురించి అనేకసార్లు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధికారులు బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆయా లేఔట్‌లలో మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



గొల్లపుంత కాలనీ అక్రమ లేఔట్‌లో హెచ్చరిక బోర్డు

అధికారులు గుర్తించినవి ఇవీ..

గొల్లపుంత వద్ద ప్రభుత్వ లేఔట్ సమీపంలో 2.05 ఎకరాలు, 1.50 ఎకరాల్లో లేఔట్‌లు ఏర్పాటు చేశారు. వీరభద్రపురం సమీపంలో 0.18 ఎకరాలు, 1.47 ఎకరాలు, శ్రీనగర్ కాలనీలో 0.67 ఎకరాలు, గొల్లపుంత రామాలయం సమీపంలో 0.07 ఎకరాలు, గొల్లపుంత లేఔట్‌కు ఎదురుగా ఉన్న 0.60 ఎకరాలు, ఆలమూరు రోడ్డులో 1.50 ఎకరాలు, ధర్మగుండం లేఔట్ సమీపంలో 0.80 ఎకరాల్లో అక్రమ లేఔట్‌లు ఉన్నట్లు గుర్తించి అధికారులు నోటీసులు జారీ చేశారు.

మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనుమతులు



మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారులను విభజించి లేఔట్‌లకు పరిశీలించి అనుమతులు ఇస్తాం. ముందస్తు అనుమతులు తీసుకోకపోతే నిర్మాణాలు చేసుకోలేరు, బ్యాంకు రుణాలు పొందలేరు. మున్సిపాలిటీ పరంగా ఎటువంటి సౌకర్యాలు కల్పించలేం. గతంలో స్థలాలు కొనుగోలుచేసిన వారు ముందుగా ఎల్ఆర్ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకుని అపరాధ రుసుము చెల్లించ వలసి ఉంటుంది. రహదారుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా మున్సిపాలిటీకి ఇవ్వాల్సి ఉంటుంది. విద్యుత్ స్తంభాలను సంబంధిత వ్యక్తులే ఏర్పాటు చేయించుకోవాలి. అన్ని సౌకర్యాలు ఏర్పాటైన తరువాత నిర్మాణానికి ఆన్‌లైన్‌లో ప్లాను పెట్టుకుంటే పరిశీలించి అనుమతులిస్తాం. అక్రమ లేఔట్‌లు వేసిన యజమానులు స్పందించకపోతే రెండుసార్లు నోటీసులు జారీ చేసి, అనంతర కోర్టులో కేసు వేస్తాం.

- ఎ.శ్రీధర్, పట్టణ ప్రణాళిక అధికారి, మండపేట

కపిలేశ్వరపురం మండల పరిషత్తు సమావేశం నేడు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను ఆహ్వానించినట్లు చెప్పారు.

'స్వప్రయోజనాలు ఆశించే పార్టీ మార్పు'

మండపేట, న్యూస్‌టుడే: స్వప్రయోజనాల కోసమే కౌన్సిలర్లు పార్టీ మారుతున్నారని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా విమర్శించారు. ఇటీవల కొందరు వైకాపా కౌన్సిలర్లు వార్డు అభివృద్ధి పేరుతో పార్టీ మారడంపై ఆయన మండిపడ్డారు. గత నాలుగు నెలల్లో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో ఆయా వార్డుల్లో చేసిన అభివృద్ధి పనులను సోమవారం ఒక ప్రకటనలో ప్రస్తావించారు.

బాధితులకు మంత్రి పరామర్శ

పామర్రు, న్యూస్‌టుడే : సత్యవాడ గ్రామంలో నాయకుడు దేవరపల్లి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో.. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారులు

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు మాస్టర్ ప్లానులో పేర్కొన్న దానికి భిన్నంగా ఉన్నాయి. దీనికితోడు ఆక్రమణల కారణంగా కుంచించుకుపోయాయి. మండపేట ప్రధాన రహదారిని మూడు రకాలుగా మాస్టర్ ప్లానులో విభజించారు. పెదకాలువ నుంచి కమ్మసంఘం వరకు 60 అడుగులు వెడల్పు ఉంటే. అక్కడ నుంచి తితిదే కల్యాణ మండపం వరకు 80 అడుగులు, అక్కడ నుంచి జొన్నాడ వరకు 100 అడుగుల విస్తీర్ణంతో ఉండాలి. పరిశ్రమలు ఎక్కువగా ఉండే ఏడిద రోడ్డు కూడా 100 అడుగులు మాస్టరు ప్లానులో ఉంటే.. ఆక్రమణల కారణంగా 60 అడుగులు కూడా లేదు. వాణి మహల్ వద్ద మాత్రం కేవలం 20 అడుగులు ఉండడం గమనార్హం. ప్రధాన రహదారి అయినప్పటికీ ఇక్కడ విస్తరణ చేయకపోవడం వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు. కేపీ రోడ్డులో కూడా కలువపువ్వు సెంటరు నుంచి మారేడుబాక వంతెన వరకు 60 అడుగుల విస్తీర్ణం మాత్రమే ఉంది. ఈ రోడ్డులో గతంలో విస్తరణ సమయంలో 40 అడుగుల విస్తరణకు సహకరించి కొంతమంది తమ భవనాలు తొలగించుకున్నారు. నష్టపరిహారం ఆశిస్తే 60 అడుగుల వరకు ఖాళీ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో కొంతమంది సహకరించారు. ఇది కూడా పూర్తి స్థాయిలో జరగక పోవడంతో మధ్యలో రహదారి కుంచించుకుపోయి ఇరుకుగా మారింది. దీని వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యతోపాటు పార్కింగ్ సమస్య అధికంగా ఉంది. దీనిపై మండపేట పట్టణ ప్రణాళిక అధికారి ఎ.శ్రీధర్‌ను వివరణ కోరగా, మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారులను విస్తరిస్తామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేసే వారు రహదారుల పక్కన కొంత స్థలం వదలితేనే అనుమతులు ఇస్తామన్నారు.



వాణి మహల్ వద్ద 20 అడుగుల విస్తీర్ణం కారణంగా ట్రాఫిక్ ఇబ్బంది

పనులు పూర్తిచేయాలి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ సూర్యచక్రధరరావు ఆదేశించారు. ఆయన సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో ఆలయ పరిసరాలను పరిశీలించారు. కొత్త పార్కింగ్ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దర్శనం సులువుగా అయ్యేవిధంగా క్యూలైన్లు మార్పు చేయాలన్నారు.

అంతరాయాల నివారణకు చర్యలు

ఆలమూరు: చొప్పెల్ల సబ్‌స్టేషన్‌లో తరచూ విద్యుత్తు అంతరాయాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్ఈ రాజబాబు, డీఈ కె రత్నాలరావు, ఏడీఈ సీహెచ్ శ్రీధర్ అన్నారు. సబ్‌స్టేషన్‌లో పనులను వారు సోమవారం పరిశీలించారు. ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

మురుగు పారక ఇబ్బందులు

సమస్య: తాపేశ్వరం శివాలయం సమీపంలో వెనుకవీధిలోని డ్రెయినేజీలో మురుగు ముందుకు పారకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

- గౌరీపతి, తాపేశ్వరం

సమాధానం: పరిస్థితిని పరిశీలించి వెంటనే చర్యలు చేపడతాం.

- చక్రధరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

గోతులతో ఇక్కట్లు

సమస్య: ఏడిద-దుళ్ల రహదారిలో పెద్ద గోతుల వల్ల వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- రామయ్య, ఏడిద

సమాధానం: సాధారణ నిధులతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

- సూర్యనారాయణ, రభ శాఖ, డీఈ

పొదల్లో నియంత్రిక

సమస్య: తాపేశ్వరంలో విద్యుత్ నియంత్రికలను పొదలు చుట్టుకున్నాయి. నియంత్రిక చుట్టూ పొదలను తొలగించి శుభ్రం చేయాలి.

- విశ్వేశ్వరరావు, తాపేశ్వరం

సమాధానం: నియంత్రికల చుట్టూ ఉన్న పొదలను, తీగలను తొలగించి శుభ్రం చేయిస్తాం.

- రవికుమార్, విద్యుత్ శాఖ ఏఈ, ద్వారపూడి సెక్షన్



– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

రహదారిపై చెత్తతో ఇక్కట్లు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అన్నాయిపేట పంచాయతీ పరిధిలోని శ్మశానవాటికలో చెత్త పేరుకుపోయి అధ్వానంగా ఉండేది. దీనిపై అనేకసార్లు కథనాలు ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు స్పందించి శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించారు. చెత్తను బయట వేస్తుండటంతో ఆ ప్రాంతం సుందరంగా కనిపించేది. ఇప్పుడు శ్మశానం పక్కన ఉన్న రోడ్డు మొత్తం చెత్తతో నిండిపోయింది. ద్రాక్షారామ నుంచి యానాం వెళ్లే రహదారి కావడం, దుకాణాలకు దగ్గరగా ఉండటం వల్ల చెత్త నుంచి వెలువడే దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సర్పంచి పెమ్మిరెడ్డి దొరబాబును వివరణ కోరగా, గ్రామానికి డంపింగు యార్డు లేక ఇబ్బందిగా ఉందన్నారు. రోడ్డుపైకి వచ్చిన చెత్తను వెనక్కి నెట్టించే చర్యలు చేపడతామన్నారు.



అన్నాయిపేట శ్మశానం పక్కన రోడ్డుపై ఇలా..

పల్లె పండగతో అభివృద్ధి: ఎమ్మెల్యే వేగుళ్ల

ద్వారపూడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు నింపడమే ధ్యేయంగా పని చేస్తోందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ద్వారపూడి పంచాయతీలో వేములపల్లి, డ్రైవర్స్ కాలనీల్లో రూ.1.12 కోట్లతో, జడ్.మేడపాడులో రూ.10 లక్షల అంచనాతో సీసీ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సర్పంచులు ఈతకోట కిన్నెర, కంచర్ల చంద్రశేఖర్, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, కార్యదర్శులు ఆకుల వివి.రమణ, అమర్‌నాథ్‌చౌదరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండపేట గ్రామీణం: ఉపాధి హామీ నిధులు రూ.2.50 కోట్లతో మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. సోమవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మారేడుబాక, తాపేశ్వరం, ఇప్పనపాడులో భూమి పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఆత్మా మాజీ సభ్యులు పిల్లా తాతాలు, తాపేశ్వరం సర్పంచి వాసంశెట్టి రాజేశ్వరి, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



జడ్.మేడపాడులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో నేటి నుంచి..

అంగర: కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. మంగళవారం కోరుమిల్లి, కపిలేశ్వరపురం, అచ్యుతాపురం, వల్లూరు, అద్దంకివారిలంక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే 39 పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భూమి పూజలు చేస్తారన్నారు.

రాయవరం: మండలంలో నదురుబాద, వెదురుపాక, వి.సావరం గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాన్ని 15న నిర్వహించనున్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక పంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రధాన రహదారి.. వాననీరు చేరి

రహదారులు, భవనాల శాఖ డీఈ, జేఈ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఏరియా ఆసుపత్రి, కృత్తివెంటి క్రీడా ప్రాంగణానికి వెళ్లే ప్రధాన రహదారిపై ముంపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్‌ బీ డీఈ కార్యాలయం గేటు ఎదుట రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. వర్షం వస్తే వారం రోజులపాటు మురుగు నీరు నిలిచిపోతోంది. పట్టణంలో పదో పరిధిలో ఉన్న ఈ రోడ్డుపై విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న రహదారిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి వర్షం నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ డీఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా త్వరలో క్రీడా ప్రాంగణం రోడ్డును పరిశీలించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, రామచంద్రపురం



ఆర్‌అండ్‌బీ డీఈ కార్యాలయం ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు

పిడుగుపాటుకు ఒకరి దుర్మరణం

కాజులూరు, న్యూస్‌టుడే: ఉప్పుమిల్లి గ్రామంలో సోమవారం పిడుగు పడిన ఘటనలో తాపీమేస్త్రి నందికోళ్ల వీరాస్వామి (35) మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వేకువజామున వర్షం పడుతుండటంతో పశువులను పాకలో కట్టేందుకు పొలం వెళ్లగా ఉదయం అయిదు గంటల ప్రాంతంలో పిడుగుపాటుకు గురయ్యారు. స్థానికులు గమనించి వెంటనే యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమకు దెక్కవరంటూ వారు విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన వీరాస్వామి అయిదేళ్ల క్రితం ఉప్పుమిల్లి గ్రామానికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విచాదఛాయలు అలముకున్నాయి.

గుంతను తప్పించబోయి రెండు వాహనాల ఢీ

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం కేశవరం వద్ద కెనాల్ రహదారిలో సోమవారం సాయంత్రం రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో కారు ముందుభాగం దెబ్బతింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో భారీ గుంత ఉండటంతో మినీ వ్యాన్ చోదకుడు అకస్మాత్తుగా బ్రేకు వేయడంతో వెనుక వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఢీకొట్టిన వాహనం రహదారి మధ్యలో ఉండడంతో రెండు వైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న మండపేట రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని రూరల్ ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.



ప్రమాదంలో ముందుభాగం దెబ్బతిన్న కారు

దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల స్వాధీనం

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలో ప్లాస్టిక్ సంచుల నిషేధం విధించిన నేపథ్యంలో అధికారులు ఇప్పటికే వ్యాపారులకు అవగాహన కల్పించారు. 'ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా' శీర్షికన ఈ నెలం 10న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ప్లాస్టిక్ కవర్లతో ప్యాకింగ్ చేసే దుకాణాలు, తోపుడు బండ్లపై అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 10 దుకాణాలపై నిర్వహించిన దాడుల్లో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని ఒకొక్కరికి రూ.200 చొప్పున రూ.1000 అపరాధ రుసుము వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. దాడులు మరింత ముమ్మరం చేస్తామని, దాడులు చేసిన దుకాణాల్లో మళ్లీ ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, వినియోగించినా అపరాధ రుసుము పెంచుతామని తెలిపారు. దాడుల్లో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చేతిసంచులు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

రెయిలింగ్ ఛిద్రం.. పునర్నిర్మిస్తేనే భద్రం

తాపేశ్వరం కాలువపై నిర్మించిన కాలిబాట రెయిలింగ్ దెబ్బతినడంతో పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు రెయిలింగ్ దెబ్బతిని చాలా కాలమైంది. ఇటుగా వెళ్లే వాహన చోదకులు పలువురు అదుపు తప్పి కాలువలో పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెయిలింగ్‌ను పునర్నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ శాఖ జేఈ అజీజ్‌ను వివరణ కోరగా, రెయిలింగ్ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

వేదం.. జీవన నాదం

యాభై ఏళ్లుగా కొనసాగుతున్న వేద పాఠశాల

న్యూస్‌టుడే, అంగర

'ఏనం విందంతి వేదేన తస్మాద్వేదస్య వేదహః' మనకు కావాల్సిన వాటిని దగ్గరకు చేర్చి, అక్కర్లేని వాటిని పరిహరించేదే జీవన వేదమని శాస్త్రం చెబుతోంది. వేదాల ప్రాముఖ్యతను గుర్తించిన మాజీ కేంద్ర సహాయ మంత్రి ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు(చంటిదొర), రాజరాజ్యేశ్వరమ్మ దంపతులు కపిలేశ్వరపురంలో వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారు. కంచి పరమాచార్య ఆదేశానుసారం 1973 ఆగస్టు 23న సర్వారాయ వేద పాఠశాలను ప్రారంభించారు. ఉచితంగా వేదాధ్యయనం చేయిస్తున్నారు. చంటిదొర తర్వాత డా.రామ్మోహనరావు పాఠశాలను పర్యవేక్షిస్తూ కొనసాగిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు తిరుమల, అన్నవరం, విజయవాడ, శ్రీశైలం, భద్రాచలం, ద్వారకా తిరుమల తదితర పుణ్య క్షేత్రాల్లో ప్రధాన పండితులు, ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. పలు ఆలయాలకు సలహాదారులుగా ఉన్నారు. విదేశాల్లోనూ పండితులుగా స్థిరపడి వేదకీర్తిని చాటుతున్నారు.

ఎంపిక విధానం ఇలా..

పదేళ్ల నుంచి పదమూడేళ్ల లోపు వయసు, ఉపనయనం పూర్తిచేసుకున్న బ్రాహ్మణ బాలుర్ని పాఠశాలలో చేర్చుకుంటారు. సుమారు 10 నుంచి పన్నెండేళ్ల పాటు వేదాధ్యయనం నేర్పుతారు. అన్ని వసతులు కల్పిస్తారు. ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం, లెక్కలు, సైన్సు తదితర సబ్జెక్టులను బోధించి పదో తరగతి స్థాయిలో తీర్చిదిద్దుతారు. బుద్ధి కుశలత, వాక్చాతుర్యత, ఉచ్ఛారణ, సంప్రదాయాల్ని పరిగణనలోకి తీసుకుని విద్యార్థులను చేర్చుకుంటారు. ప్రస్తుతం ఇక్కడ కృష్ణ యజుర్వేదం, అధర్వణ వేదాల్లో విద్యార్థులను తయారు చేస్తున్నారు.

పరీక్ష విధానం..

మహర్షి వేద విద్యా ప్రతిష్ఠాన్ (హెచ్‌ఆర్‌డీ) ద్వారా ఏటా వివిధ విభాగాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. వేద రక్షణ నిధి ట్రస్ట్ ద్వారా దేశంలో గుర్తింపు పొందిన సంస్థలు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి పండితులు వచ్చి వివిధ అంశాల్లో విద్యార్థులను పరీక్షిస్తారు. ఉత్తీర్ణులైన వారిని ముందు తరగతులకు పంపుతారు. పన్నెండేళ్లలో వేదాధ్యయనం పూర్తిచేసిన వారికి వేద విభూషణ్ గుర్తింపు పత్రాలు అందజేస్తారు.

పలు పాఠశాలలకు ఆదర్శం

సర్వారాయ వేద పాఠశాల రాష్ట్రంలో మిగిలిన వేద పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఇప్పటి వరకు 12 నుంచి 15 బృందాల విద్యార్థులు వేదవిద్య పూర్తిచేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మూడేళ్ల క్రితం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులంతా విచ్చేసి తోటి స్నేహితులను కలుసుకున్నారు.



వేద విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు

ఇక్కడే విద్య.. బోధన..



వేద పఠనం క్రమపద్ధతిలో జరగాలి. విద్యార్థులు అన్నింటినీ సాధన చేసి పరిపూర్ణ పండితునిగా ఇక్కడ నుంచి బయటకు వెళ్లే విధంగా తీర్చిదిద్దుతున్నాం. నేను ఇదే పాఠశాలలో చదువుకుని, ఇక్కడే ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. వేదం జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. తోటి వారితో ఎలా మెలగాలో, సమాజంలో ఎలా నడుచుకోవాలో నేర్పిస్తుంది.

- తంగిరాల సత్య దత్తాత్రేయశర్మ, వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు